
కథ

# భయం

కట్టా రాంబాబు



బస్టాండ్ కాంటిన్లో టీ తాగుతూ ఆమెవంక చూసాడతను. చూసిన వెంటనే "బాగుంది" అనుకున్నాడు. నిజానికామె చాలా బాగుంది. గుండ్రని ముఖం, చక్రాల్లాంటి కళ్లు, సన్నని నడుము, మంచి స్ట్రక్చర్‌తో చాలా అందంగా వుంది.

ఆమెకూడా టీ తాగుతూ అతన్ని చూసి మనిషి బాగున్నాడే అనుకుంది.

అది విజయవాడ బస్టాండ్. చాలా హడావిడిగా వుంది. గుంటూరు వెళదామని అతనొచ్చాడు. ఆమె గుంటూరు నుంచి విజయవాడొచ్చింది. తనవంక రెప్పలు వాల్చకుండా చూసునతని చూసి ముందు ముఖం చిట్లించుకున్నా తర్వాత ఆనందపడింది. తను అందంగా వుండబట్టే కదా అతనలా చూస్తున్నాడనుకొని కొంచెం గర్వంగా ఫీలయ్యింది. తన కళ్లలోకి చూస్తూ చిరునవ్వు నవ్వినప్పుడు తల తిప్పుకుంది కానీ రెండోసారి నవ్వినప్పుడు మాత్రం అతని నవ్వుతో శృతి కలిపింది.

ఆమె నవ్వుని చూసిన తర్వాత అతనికి ధైర్యం వచ్చింది. ఎలా అయినా సరే ఆమెతో మాటలు కలపాలనుకున్నాడు. అయితే ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? ఇంతవరకు ఆడవాళ్లతో పెద్దగా పరిచయం లేదు. ఎప్పటినుంచో కోరికగా వుంది అమ్మాయితో గడపాలని. యింతవరకు అటువంటి అవకాశం రాలేదు. కాని యిప్పుడా అమ్మాయి తనని చూసి నవ్వింది కాబట్టి దానిని సాకుగా తీసుకుని పరిచయం పెంచుకుని తన దారిలోకి తెచ్చుకోవాలనుకున్నాడు. తాను అడిగితే ఆమె కాదని అనదనిపించింది. ఎందుకంటే తనెవ్వరో అసలు తెలియనప్పుడు తను నవ్వితే రెస్పాన్స్ యిచ్చిందంటే తనంటే యిష్టపడుతున్నట్టే కదా! అందుకే ఆమెతో మాట్లాడాలని ఆమె దగ్గరకు నడిచాడు.

ఆమె అప్పుడే తాగిన టీ కప్పుని టేబిల్ మీద పెట్టి పైకి లేచింది. తన దగ్గరకొస్తున్న అతన్ని చూసి ముందు భయపడింది. కాని తర్వాత రానియ్యి చూద్దామనుకుంది.

అతనొచ్చి ఆమె ప్రక్కగా నిలబడ్డాడు.

అతను తన పక్కకొచ్చి ఆగడంతో ఆమె అలాగే నిలబడిపోయింది. కాస్సేపటికి గొంతు పెగుల్చుకుని నెమ్మదిగా అన్నాడు. "మీతో కొంచెం మాట్లాడాలి అలా వస్తారా" అని.

"ఎందుకు" అనడిగిందామె.

"ఇక్కడ చాలామంది వున్నారు. అక్కడ చెపుతాను రండి."

సరేనంటూ అతని వెంట నడిచింది.

ఇద్దరూ దూరంగా ఎవరూ లేనిచోట నిలబడ్డారు.

"చెప్పండి" అందామె అతని ముఖంలోకి చూస్తూ.

అతను కొంచెంసేపు తటపటాయించి "మీరు చాలా బాగున్నారు" అన్నాడు.

"థాంక్స్. ఇదా మీరు చెప్పాలనుకుంది" అంటూ నవ్వింది.

"అబ్బే అలా అని కాదు..." అంటూ తడబడ్డాడు.

"అంటే నేను అందంగా వుండననా" అంటూ మళ్లీ నవ్వింది అల్లరిగా.

"మీరు నన్ను కన్‌ఫ్యూజ్ చేస్తున్నారు. అయితే వినండి స్ట్రెయిట్‌గా చెప్పేస్తాను. మీరు అందంగా వున్నారు నిజమే. మీరు నాకు చాలా నచ్చారు. మీరు అంగీకరిస్తే మనం ఎక్కడికైనా వెళ్లి ఒక గంటసేపు ఎంజాయ్ చేద్దాం. ఇందులో బలవంతమేమీ లేదు. మీకిష్టమయితేనే సుమా."

అతనంత డైరెక్టుగా అలా మాట్లాడతాడని ఆమె వూహించలేదు. అయితే అతను తనని పిలవడంలో వుద్దేశ్యమదే. అయినా అతనలా అడుగుతాడని ఆమె అనుకోలేదు. అతనికిప్పుడేం చెప్పాలి?

అవుననాలా? కాదనాలా?

అవునంటే తననతను ఎలా అనుకుంటాడు. అలాంటి దాననుకుంటాడు కదూ.

కాదంటే.... ఎందుకో కాదనాలనిపించడం లేదు.

ఆలోచిస్తున్నారు. భయపడుతున్నారా? నేనెక్కడికో తీసుకుపోను. నా రూమే వుంది. అది కొంచెం దూరంగా వుంటుంది. ఎవరికీ తెలియదుకూడా." అన్నాడతను.

అప్పటికీ ఆమేం పోట్లాడక పోయేసరికి మళ్లీ అన్నాడు.

"మీరు వస్తే మిమ్మల్ని వట్టి చేతులతో పంపుతానని అనుకోకండి. మీకెంత కావాలంటే అంత యిస్తాను."

ఆ మాటలకామె మనస్సు చివుక్కుమంది.

అంటే తను డబ్బులకాశపడి ఒప్పుకుంటాననుకున్నాడా? తన నిస్సహాయస్థితికి ఆమె చాలా బాధపడింది మనులో.

'మీకిష్టమయితే బయట సిటీ బస్టాండ్ దగ్గర నిలబడండి. నేనక్కడికొస్తాను. కలిసి వెళితే తెలిసిన వాళ్ల కళ్లపడతాము" అన్నాడతను.

సరేనని చెప్పి ఆమె అక్కడనుంచి కదిలింది.

అలా వెళుతున్న ఆమెని చూసి ఆలోచనలో పడ్డాడతను.

ఆమె అంత సులువుగా ఒప్పుకుంటుందనుకోలేదు. అంటే ఆమె తప్పనిసరిగా ఆ బాపతే.

ఆమె తన దగ్గరనుంచి డబ్బులు బాగానే గుంజుతుంది. అసలిలాంటి వాళ్లతో చాలా జాగ్రత్తగా వుండాలి. ఎప్పుడో పేపర్లో చదివాడు. ఇలాంటివాళ్లు మగవాళ్లతో కలిసి ఒక టీమ్‌గా వుంటారట. ఆడవాళ్లని మాట్లాడుకుని తీసుకెళుతుంటే వీళ్లని ఫాలో అయిన మగవాళ్లు కొంతదూరం వెళ్లాక బెదిరించి దగ్గరున్న సొమ్మంతా దోచుకుపోతారట. అందులోను తన దగ్గర చాలా డబ్బుంది. గుంటూరులో ఉన్న బ్రాంచ్ ఆఫీసులో యివ్వాల్సిన డబ్బది. పోతే యింకేమైనా వుందా? ఉద్యోగం పోతుంది. అందుకే అతనికి యింకో భయం కూడా పట్టుకుంది. అసలే యిప్పుడు ఎయిడ్స్ మహమ్మారి విస్తృతంగా వ్యాప్తిలో వుంది.



## అన్ని జతలా?

అవునట. సాధారణంగా భారతీయ మహిళలు లోదుస్తులు పెద్దగా కొనుక్కోరు. కొన్నా నాలుగైదు జతలే వుంటాయని కచ్చితంగా చెప్పొచ్చు అమెరికన్ మహిళలు మాత్రం తమ ఆదాయంలో నలభై శాతం వాటికే ఖర్చు పెడతారట. అందుకే వారికి లోదుస్తుల సెట్లు వందల కొద్దీ వుంటాయి. కావాలంటే ఎవరైనా అమెరికన్ స్నేహితురాలుంటే, ఆమె వార్డ్ రోబ్ తెరిచి చూసుకోవచ్చు

ఆమెకు నిజంగా ఎయిడ్స్ వుంటే తన జీవితం నాశనమయిపోతుంది.

ఎందుకొచ్చిన గొడవ యిలాంటి వాటితో జాగ్రత్తగా వుండాలి. తనకోసం చూసి అదే పోతుందిలే అనుకుని అప్పుడే గుంటూరు పోయే బస్సు బయలుదేరుతుంటే అదెక్కేసాడతను.

***

బయటకొచ్చిన ఆమె ఆలోచనలో పడింది.

తను చేస్తున్నది తప్పా? ఒప్పా?

ఒప్పెలా అవుతుంది ముమ్మాటికీ యిది తప్పే.

కానీ తనెందుకు చేస్తుంది?

అతను అందంగా వున్నమాట నిజమే. మనస్సు చలించిన మాట కూడా నిజమే. అంత మాత్రంచేత అతను అడిగితే ఒప్పేసుకోవడమేనా?

మరేం జేస్తుంది? ఒంటిమీదకు పాతికేళ్ల వయస్సు దాటిపోయింది. చదువులేదు. ఇప్పట్లో తనకి పెళ్లిచేసే శక్తి యింట్లో లేదు. తనకంటే ముందు యింకా యిద్దరు అక్కల పెళ్లిళ్లు కావాలి. అంతకాలం ఎటువంటి ఆనందానికి నోచుకోదు తను. ఈవేళ బంధువులింటికని బయలుదేరింది. సూర్యారావుపేటలో వుంటారు వాళ్లు. వాళ్లింటికెళ్లబోయేముందు తగిలాడతను. తనింతవరకు పురుష సాంగత్యం ఎరుగదు. రొటీన్ లైఫ్ నుంచి బయటపడి కాస్త ఆనందంగా గడపొచ్చని అతనితో పోవడానికి సిద్ధపడింది. అతను డబ్బుకూడా యిస్తానన్నాడు. అర్థరూపాయి ఖర్చుకి కూడా యింట్లో అడగాలి. అటువంటప్పుడు అతను వందో, రెండొందలో యిస్తే కనీసం తన ఖర్చులకన్నా వుంటాయని ఆశపడింది.

అడిగిన వెంటనే ఒప్పుకుంది. కాబట్టి తనని మరో విధంగా భావించి వుంటాడతను. అయినా దానిని తను పట్టించుకోలేదు.

కాని యిప్పుడతనితో వెళ్లడం ఎంతవరకూ సమంజసమని మధనపడుతుందామే.

ఒక్కసారి దీనికి అలవాటుపడితే ముందుముందు పీకలోతులోకి దిగజారిపోతుంది. అసలతనెటువంటివారో తెలియదు. దీన్ని ఆధారం చేసుకొని తనని బ్లాక్‌మెయిల్ చేస్తే? అతను రూముకి తీసుకెళతానంటున్నాడు. అక్కడ యింకా అతని ఫ్రెండ్స్ వుంటే యితని తర్వాత తనని వాళ్లకప్పజెప్పితే? అమ్మో యింకేమైనా వుందా? అసలిటువంటి మగవాళ్లని నమ్మకూడదు. అయినా యిప్పుడు శీలం పోగొట్టుకుని రేపు పెళ్లయితే భర్తతో పవిత్రంగా కాపురం చెయ్యగలదా తను. ఆమెకింకో భయం కూడా పట్టుకుంది.

ఇప్పుడు చేసేపనికి రేపు ఏ కడుపో వస్తే తన బ్రతుకేంగాను... తన కుటుంబ పరువేంగాను. అప్పుడు అందరికీ చావే శరణ్యం.

క్షణికమైన సుఖంకోసం తనెందుకింత ఆత్ర పడాలి. అంతే! ఆ తర్వాత ఆమేం ఆలోచించలేదు.

అతనొచ్చి వెతుక్కుని పోతాల్లే అనుకుని అప్పుడే వచ్చిన సిటీబస్సెక్కేసిందామె సూర్యారావుపేటలో వున్న బంధువులింటికి పోవడానికి.

***

అప్పుడప్పుడు మనుషులు తప్పులు చెయ్యకుండా వుంటున్నారంటే భయం అనేది కారణం అనుకుంటాను. లేకపోతే చాలామంది చాలా తప్పులు చేసి వుండేవారు. ■